

హైదరాబాద్ వార్త

# కొండాపూర్‌లో అనుమతి లేని వాణిజ్య సముదాయం సీజ్

**-కోర్టు ఆదేశాలతో సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు**

**సైబరాబాద్ ప్రతినిధి, జూలై 11 ప్రభాతవార్త**

హైటెక్‌సిటీ పరిధిలోని కొండాపూర్ రాఘవేంద్రకాలనీలో గల ఓ భారీ వాణిజ్య సముదాయాన్ని గురువారం జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేని నిర్మాణంలో సదరు వాణిజ్య సముదాయం కొనసాగుతుండడంతో కోర్టు ఆదేశాలతో శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ సర్వే నెంబరు 78నుంచి 93వరకు గల రాఘవేంద్ర కాలనీలో గల ప్లాట్ నెంబరు 327లో ఉన్న 720 గజాల విస్తీర్ణంలో ఓ వాణిజ్య సముదాయం కొనసాగుతుంది. కాగా ఈ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తుంది. మరోవైపు సదరు స్థలంలో భారీ షెడ్ ఏర్పాటు చేసి వాణిజ్య సముదాయాన్ని కొనసాగిస్తుండగా, చింతల కుమార్‌యాదవ్ అనే వ్యక్తి సదరు నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులకు పిర్యాదు చేయడంతో పాటు కోర్టును ఆశ్రయించాడు. వాణిజ్య సముదాయం కొనసాగుతున్న నిర్మాణాన్ని కూల్చివేయాలని కోర్టు ఈసంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ ఉత్తర్వులపై స్థల యజమాని వెంగళరావు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశాడు. దీనిపై అప్పీలుకు వెళ్లాలని కోర్టు సూచించింది. ఈమేరకు సిటీ స్మాల్ కాసెస్ కోర్టు వెంగళరావుకు అనుకూలంగా స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు అక్రమ నిర్మాణంపై కోర్టు ఉత్వర్వుల మేరకు శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ అధికారులు వాణిజ్య సముదాయానికి ఈ సంవత్సరం మార్చి 22, ఏ ప్రిల్ 10వ తేదీల్లో రెండు నోటీసులు జారీ చేశారు. కోర్టు ఇచ్చిన స్టేటస్ కో జూన్ 28వ తేదీన వెకెట్ కావడంతో జీహెచ్ఎంసీ అధికారులు సదరు అనుమతి లేని నిర్మాణం మీద చర్యలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గురువారం స్పెషల్ టాస్క్ ఫోర్స్ డిఈ విశాలాక్షి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు వాణిజ్య సముదాయాన్ని సీజ్ చేశారు. వాణిజ్య సముదాయాన్ని మూసివే యించి, షెట్లర్లకు సీల్ వేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడంపై సీజ్ చేస్తున్నట్లు బ్యానర్లు ఏర్పాటు చేశారు.

# విద్యార్థులు, ఆత్మహత్యలు

**-పెరుగుతున్న బలవన్మరణాలు**

**-ఒత్తిడికి పర్యవసానంగా తప్పుడు నిర్ణయాలు**

**-బాధితుల్లో చిన్న పిల్లలు కూడా..**



**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**

**ఒత్తిడికి తట్టుకోలేక ఎందరో విద్యార్థుల ఆత్మహత్యలు ఇటీవలె కాలంలో ఎక్కువవుతున్నాయి. పరీక్షల ఒత్తిడి, పని ఒత్తిడి, అప్పుల బాధలు తది తర కారణాలతో యువకులైన విద్యార్థులు, చిరుద్యోగులూ సతమతమ వుతుంటే, మరో పక్క పాఠశాల విద్యార్థుల మానసిక వంచనలు పసి పిల్లల ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. మీ పిల్లవాడికి చదువు అబ్బదని తల్లిదండ్రుల ముందే సిబ్బంది నిర్ణయించేయడం, వయసుకు మించిన అవమానాలు, వేధింపులు ఎదుర్కోవడంతో పసిమనసులు చీక ట్లోకి నెట్టివేయబడుతున్నాయి.**

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో విద్యార్థులు, చిరుద్యోగులు ఎన్నుకునే తప్పుడు దారుల్లో బెట్టింగ్ యాప్‌లు కూడా కీలకంగా మారాయి. యాప్‌లలో డబ్బు పోగొట్టుకుని ఎవరికీ చెప్పుకోలేక, చేసిన అప్పులు తీర్చలేక ఎందరో యువకులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. బెట్టింగ్ బాధితుల్లో చాలా మంది విద్యార్థులతో పాటు, డబ్బుని ఇన్వెస్ట్ చేయడం తెలీని ఎందరో ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఒక్కసారి ఇన్‌స్టెంట్ మనీ రావడంతో వీళ్ళు బెట్టింగ్ యాప్‌లకు బానిసై విడతల వారీగా ఎక్కువ డబ్బు పెట్టి, ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. కాలేజి ఫీజు కట్టాల్సిన డబ్బుని ఒక ఇంజినీరింగ్ విద్యార్థి బెట్టింగ్ యాప్‌లో పెట్టి పోగొట్టుకుని, కాలేజీకి వెళ్ళడం మాని ఇంట్లో చెప్పలేక సతమతమయ్యాడు. చివరికి తప్పుడు నిర్ణయం తీసుకుని జీవితాన్ని ముగించేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వేపోలీసులు వివరాల ప్రకారం, బాధిత విద్యార్థి ఘట్‌కేసర్ వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఒక ప్రైవేట్ హాస్టల్ బిల్డింగ్ మీద నుంచి దూకి మల్లారెడ్డి అగ్రికల్చరల్ యూనివర్శిటీ 3వ సంవత్సరం విద్యార్థి హరినాథ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పైనుంచి దూకడంతో కరెంటు తీగలు తగిలి గాయాలపాలయ్యాడు. ప్రాణాపాయంలో ఉన్న అతడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదయింది.

**చిన్నపిల్లల మనస్సులో చిచ్చులు :**

పట్టుమని పదేళ్ళు నిండిన పాఠశాల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునేంత కఠిన నిర్ణయం తీసుకోవడంపై మానసిక వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు ఊహించని విధంగా మానసికంగా గాయపడడంతో విపరీత నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చి శాశ్వతంగా కన్ను మూస్తున్నారు. తాజాగా నీకు చదువు రాదని పాఠశాల సిబ్బంది తన తల్లిదండ్రుల మొహం మీదే చెప్పడంతో నాలుగో తరగతి చదివే బాలుడు తట్టుకోలేకపోయాడు. పట్టుమని 13 ఏళ్ళు నిండని ఆ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. గురుకుల పాఠశాలలో అడ్మిషన్ కోసం అతడి తల్లిదండ్రులు తీస్కెళ్ళగా, అక్కడ సిబ్బంది వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతూ మౌనంగా ఉండిపోయాడు. పసి పిల్లలకు విద్యాబోధనలు చేయాల్సిన పాఠశాల సిబ్బందే మీ పిల్లాడికి ఇక చదువు రాదని అతడి ముందే తన తల్లిదండ్రులతో చెప్పడంతో మనస్థాపానికి గురయిన బాలుడు తల్లిదండ్రులకు భారమయ్యానని బాధపడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తల్లి చీరతో ఉరి వేసుకుని ప్రాణాలొదిలాడు. చిన్న పిల్లల బలవన్మరణాల్లో ఇటీవలె కాలంలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే, కాచిగూడాకు చెందిన ఏడవ తరగతి చదివే హత్కారి రుచిత(12) తన తండ్రి ఫంక్షన్‌కు తీస్కెళ్ళని కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. అదే విధంగా ప్రపంచం తెలియని మరో బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వికారాబాద్‌కు చెందిన వడ్లపెద్ద వెంకటేశ్(16) అనారోగ్యం కారణంగా తన స్థానిక వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతుండడంతో మానసిక నిపుణులు పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కేరీర్ గైడెన్స్ వంటి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచిస్తున్నారు.

# సుందరయ్యపార్కులోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం**



సుందరయ్యపార్కులో వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్ అమ్రపాలి, జోనల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**

బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో ఉన్న సమస్యలకు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం ఉదయం జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి సుందరయ్యాపార్కు, మందర్‌డైరీ పార్క్, విఎస్‌టి నుండి బాగ్ లింగంపల్లి వరకు ఫేజ్2 ఫ్లైఓవర్ ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని కమిషనర్ అమ్రపాలి కాట పరిశీలించారు. సుందరయ్య పార్కులో వర్షపు నీరు నిలువడం మూలంగా ఇబ్బందులు వస్తున్నాయని దాంతో పాటు టాయిలెట్ మరమ్మత్తులు చేపట్టాలని వాకర్స్ కమిషనర్‌ను కోరగా వాకర్స్ సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఎస్ఎన్‌డిపి నాలా పనులు కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మదర్‌డైరీ పార్కు అబివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. విఎస్‌టి నుంచి బాగ్ లింగంపల్లి వరకు రెండు దశల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో నిర్ణయించారు. అయితే మొదటిదశలో ఇందిరాపార్కు నుంచి విఎస్‌టి వరకు చేపట్టిన స్టీల్‌బ్రిడ్జ్ అందుబాటులోకి వచ్చింది.

**ప్రజావాణిలో వచ్చిన విన్నపానికి జిహెచ్ఎంసి పరిష్కారం...**

బల్కాపూర్ చెరువులో కలుషితమైన నీరు వల్ల కౌసర్ కాలనీ దాని చుట్టుపక్కల కాలనీల బోర్లు కూడా కలుషితం అవుతున్నాయని ప్రజావాణిలో కౌసర్ కాలనీకి చెందిన వారు విన్నవించారు. జూబ్లీహిల్స్ నాలా మురుగు నీరు బల్కాపూర్ నాలా వెళ్తుందని తద్వారా కాలనీవాసులు ఇబ్బంది పడుతునట్లు విన్నవించారు. దీంతో జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి బల్కాపూర్ నాలా కొత్త చెరువు వద్ద పూడిక తీత పనులు చేపట్టారు. అలాగే సర్‌ప్లస్ వాటర్‌ను పునరుద్దరణ కోసం కొత్తచెరువు నుంచి నాల ఔట్‌లెట్‌వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు యుద్ద ప్రాతిపదికన చేపట్టారు. దీంతో కౌసర్ కాలనీ పాటు చుట్టపక్కల కాలనీలకు విముక్తి కలగనుంది.

## డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ, ఎసిపిలు తదితరులు

**సైఫాబాద్, జులై 11 ప్రభాతవార్త:** డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భగవంతుడు ప్రసాదించిన పవిత్రమైన మానవ జీవితాన్ని నాశనం చేసుకోరాదని తెలంగాణ యాంటి నార్కోటిక్ ఎస్పీ సీతారాం, ఎసిపిలు కె.ఎస్.రావు, సుబ్బిరామిరెడ్డి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కె. రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. యువత సన్మార్గంలో నడిచి ఉన్నత ప్రయోజనాలు పొంది తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని వారు సూచించారు. తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యంగ్ సైరన్ పేరిట నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొంత మంది యువత మాదక ద్రవ్యాలకు, వ్యసనాలకు బానిసై బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, పోలీసుల తోపాటు యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు టి.కె.శివప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిసలవుతున్న యువతకు అవగాహన కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వీటిపై వస్తున్న ప్రమాదాలపై రాష్ట్ర వ్యాప్తంగా యువతకు, విద్యార్థులలో చైతన్యం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది బలల్లూరి మురళీధర్ రావు, పిసిసి సభ్యుడు చిట్టెం అభిజయ్‌రెడ్డి, బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు భిశ్వ ఓం ప్రకాష్, సంస్థ నాయకులు పవన్, రిషబ్‌జైన్, ఎన్ వెంకట్ పాల్గొన్నారు.

## నేడు శాఖాంబరీ దేవి అలంకారంలో శ్రీఉజ్జయినీ మహంకాళీ



శ్రీఉజ్జయినీ మహాకాళీ, మాణిక్యాల అమ్మ వార్లు.

**బేగంపేట జులై 11, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు శుక్రవారం రోజున శాఖాంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రతగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఆషాడ బోనాల జాతర లో భాగంగా ఇప్పటికే అమ్మ వారి ఘటోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా ప్రారంభమైంది. ఆలయానికి రాలేని భక్తులు అమ్మ వారిని తమ ఇళ్ల ముందే దర్శించుకుని పూజలు నిర్వహించుకునే విధంగా ఘటాన్ని పురవీధులలో ఊరేగిస్తారు. ఇప్పటికే పలు వీధులలో అమ్మ వారి ఘటం భక్తులకు దర్శన మిచ్చింది. శుక్రవారం అమ్మ వారు శాఖాంబరీ దేవి గా భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసారు. శాఖాంబరీదేవిగా అమ్మ వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో వివిధ రకాలైన కూరగాయాలతో ఆలయంతో పాటు అంతరాలయంలో కూడా అలంకరణ చేయనున్నారు. ఇదే సమయంలో ఆలయం మొత్తాన్ని రంగు రంగుల పూలతో అందంగా అలంకరిస్తున్నారు. ఈ ఏడాది శాఖాంబరీ దేవి గా అమ్మ వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో సుమారు 4వేల కిలోల వివిధ రకాలైన కూరగాయాలతో ఆలయంలో అలంకరణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.

## అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



బర్కత్‌పురలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 11 ప్రభాతవార్త:** మనకు జన్మనిచ్చిన అమ్మ పేరుతో మొక్కలు నాటాలని, చెట్లును పెంచాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నేడు మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతున్నదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మన జీవితంలో అమ్మ తరువాతే అన్ని కాబట్టి అమ్మ నవమాసాలు మోసి పెంచిన అమ్మకు జ్ఞాపకంగా, అమ్మ గౌరవానికి గుర్తుగా ప్రతి వ్యక్తి మొక్క నాటాలని, అమ్మ గౌరవాన్ని పెంచాలని మోదీ ఇచ్చిన పిలుపుతో గురువారం బర్కత్‌పురలో జి.కిషన్‌రెడ్డి మొక్కలు నాటి మాట్లాడారు. అమ్మ మనల్ని ఎలా పెంచి పెద్దగా చేసిందో ఆదే తరహాలో నాటిని మొక్కను కూడా సంరక్షించి పెద్దగా చేసేవరకు కాపాడి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణకు అమ్మ ప్రేరణ కావాలని, మోదీ ఆకాంక్ష కాబట్టి అందరూ మొక్కలను నాటాలన్నారు. పర్యావణ పరిరక్షణ మన బాధ్యత దేశంలో పెరిగిపోతున్న ప్రకృతి వైపరీత్యాలు మన పరిసరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో పర్యావరణాన్ని కాపాడే బాధ్యత, పర్యావరణాన్ని పెంపొందించే బాధ్యత మన అందరిదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రోజురోజుకు అడవులు తరిగిపోతున్న తరుణంలో పచ్చదనం కోల్పోతున్న తరుణంలో భవిష్యత్తుకు ఒక పెను సవాల్ లాంటిదని, భారతమాతను, భూమని అమ్మలాగా భావిస్తామని, అందువల్ల భారతమాతను భూమిని కాపాడాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి చెప్పారు.

## తాగుతారు, నడుపుతారు..మారతారా?

**-10 రోజుల్లో 1600 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**

**-1000కి పైగా ద్విచక్రవాహనదారులు**



**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**

మద్యం తాగి వాహనాలు నడిపేవారి సంఖ్య రోజు రోజుకూ అధికమవుతోందని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ పది రోజుల పాటు నిర్వహించిన డ్రంక్ ఎండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏకంగా 1,614 మంది వాహనదారులు మద్యం సేవించినట్లు వెల్లడించారు. వీరందరిపై అధికారికంగా కేసులు నమోదు చేసిన నగర ట్రాఫిక్ పోలీసులు వివిధ కోర్టుల్లో మొత్తం 992 ఛార్జ్ షీట్లు దాఖలు చేశారు. డ్రంక్ ఎండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 1,614 మందిలో వెయ్యి మందికి పైగా బైకర్లే ఉన్నారు. టూవీలర్లలో పట్టుబడ్డవారు 1,346 మంది ఉండడం సోచనీయంగా మారింది. దాంతో సంబంధిత కోర్టుల న్యాయమూర్తులు ఈ 1,614 మందిలో 55 మందికి 15 రోజుల పాటు జైలు శిక్ష విధించడంతో పాటు 8 మంది డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేశారు. పట్టుబడ్డ మందుబాబుల నుంచి మొత్తం రూ.21,36,000 జరి మానా వసూలు చేశారు. వీరందరికీ గోషామహల్, బేగంపేట తదితర ప్రాంతాల టీటీల వద్ద కౌన్సిలింగ్ ఇచ్చి పలు విధాలుగా హెచ్చరించారు ట్రాఫిక్ పోలీసులు. దీన్ని బట్టి నగరవాసులు ఏ స్థాయిలో తాగుడుకి అలవాటు పడ్డారో అర్థమవుతోంది.

# బ్లాక్ మార్కెట్‌కు భారీగా పసిడి ..!

**-బిల్లులు లేకుండా కిలోలకొద్దీ తరలింపు**
**-దక్షిణాది సంస్థల కోసం ఇక్కడే ఆభరణాల తయారీ**
**-షాపులు,నగల తయారీ కేంద్రాలపై నిఘా కరువు**
**-నిత్యం శంషాబాద్‌లో కిలోల కొద్దీ పట్టివేత**
**-దృష్టి సారించని కమర్షియల్ టాక్స్ అధికారుల**

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**

దేశంలో బంగారం వ్యాపారం రోజురోజుకూ ఎంత అభివృద్ధి చెందుతుందో బ్లాక్ మార్కెట్‌కు కూడా విపరీతంగా తరలుతోంది. దేశవ్యాప్తంగా ఉన్నటన్నుల కొద్దీ బంగారం బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందనడానికి సాక్ష్యం పట్టుబడతున్న అక్రమ గోల్డ్ దందాదారులు, జ్యువెల్లరీ షాపుల్లో, ట్రాన్స్‌పోర్టుల్లో, పోలీసులు తనిఖీల్లో, కస్టమ్ అధికారులకు చిక్కుతున్న ఘటనలే. తాజాగా రెండురోజుల క్రితం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్న 3కోట్ల విలువైన 3కిలోల 982.25 గ్రాముల బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్(డిఆర్ఐ)అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 6న ఇద్దరు వ్యక్తులు నడుముకు ధరించే పట్టీలో బంగాన్ని తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ అమలు తర్వాత బంగారంపై పెరిగిన ట్యాక్స్‌ల వల్ల అధికశాతం వ్యాపారులు దొడ్డి దారిన జరిగే వ్యాపారానికి కే మొగ్గు చూపుతున్నారు. ఎప్పటికప్పుడు నిఘా పెట్టి అక్రమంగా సాగుతున్న ఈదందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఆదాయ, వాణిజ్యపన్నులుశాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. పోలీసులు, కష్టమ్స్ అధికారులు బంగారాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారే తప్ప.. ఆదాయపన్నులశాఖ అధికారులు పట్టుకున్న దాఖలాలైతే కనిపించడం లేదు. ఆయాశాఖల అధికారులు కార్యాచరణలోకి దిగితే ప్రభుత్వ ఆదాయానికగండి పడుతున్న కోట్ల రూపాయలు ఖజానాలోకి చేరు అవకాశాలు ఉంటాయి. బంగారు ఆభరణాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది పసిడిని స్థిరాస్థి



గా కూడా భావిస్తారు. పెద్దపెద్ద వ్యాపారులు బంగారం నిల్వలు ఉంచి వ్యాపారం చేస్తుంటారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటినుంచి పను ్నల సమీకరణాలు మారాయి. అప్పటివరకు 1.2శాతం ఉన్నప్పటికీ..గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ప్రవేశపెట్టడం వల్ల దాని విలువ 3శాతానికి పెరిగింది. ముంబైలోని జవేరీ బజారైనా..హైదారబాద్‌లోని అబిడ్స్, గుల్జార్‌హౌజ్, సికి ంద్రాబాద్ లాంటి ఆభరణాల మార్కెట్‌లైనా ..ఇప్పటివరకు చాలామంది వ్యాపారులు పన్నులు లేకుండా విక్రయించడానికి ఇష్టపడుతున్నారు. నిత్యం ఇలాంటి వ్యాపారం జోరుగా సాగుతున్నా.. ఏదైనా ఉదతం జరిగినప్పుడే ఈదందాలపై అధికారుల లెక్కల్లోనికి వస్తున్నాయి. ఆతర్వాత కొన్ని రోజుల హడావిడి చేయడం ఆతర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. తెరపైకి రాకుండా చాపకింది నీరులా సాగిపోతున్న ఈ జీరోనెంబర్ బంగారం వ్యాపారానికి నగరంలో కొదవలేదని ఐటీ అనుమానిస్తోంది. రాజధానిలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో దాదాపు40శాతం రికార్డులకు దూరంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రతి నెలా దాదాపు రూ.200-300కోట్ల వరకు ఈతరహా వ్యాపారం సాగుతోందని సమాచారం..అయినా లక్షల రూపాయల్లోనే జరుగుతుందంటూ చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. బంగారం వ్యాపారంలో ఒక్కబిల్లు కట్‌చేస్తే ట్యాక్స్‌ల రూపంలో భారీ మొత్తమే చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అటు రిటైల్ ఇటు హోల్‌సెల్ వ్యాపారాలు కాగితాల్లోనే సాగిపోతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### ఇలా చెయా ్యల్సిందే..

బంగారంషాపులు, నగర తయారీ కార్ఖానాలు, ఇతర వ్యాపార కేంద్రాలపై ఆదాయపన్నుశాఖాధికారులు తరచూ నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలి. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తయారీ కేంద్రాలకు వద్దకు వెల్లి వారి వద్దఉన్న కిలోల కొద్ది బంగారాన్ని ఎక్కడినుంచి తీసుకొచ్చారు..పత్రాలు ఉన్నాయోలేవో పరిశీలించాలి. షాపుల్లో నిల్వఉన్న ఆభరణాలకు సంబంధించిన బిల్లులు ఉన్నాయో లేవోకూడా పరిశీలించాలి.

ఇలాంటి కొన్నిచర్యలు తీసుకుంటే అక్రమం గా తరలుతున్న బంగారం..కోట్ల కొద్ది రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలి

**-ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు 15రోజుల్లో పూర్తి చేయాలి**

**-జిల్లా కలెక్టర్ అనుదీప్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిందిద్దడం మనందరి బాధ్యత అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అమ్మ ఆదర్శపాఠశాల పనుల పురోగతిపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మండలాల వారీగా పనులు పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని, అందుకోసం అధికారులందరూ తపస్సులా పనులను పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలద్వారా పాఠశాలల్లో చేపట్టిన మైనర్ రిపేర్, ఎలక్ట్రిసిటీ, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, రెన్నోవేషన్ 80శాతం పూర్తియిన వాటిని వారం రోజుల్లోగా, మిగతా పాఠశాలల్లో పనులను 15 రోజులుగా అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని అదేశించారు. జిల్లాలోని 384 పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, పనులు పూర్తయినవాటికి వర్క్ కంప్లేషన్ సర్టిఫికేట్ సమర్పించాలని సూచించారు. గతంలో పాఠశాలల్లో ఉన్న పరిస్థితులను... పనులు చేపట్టిన తర్వాత పాఠశాలల పరిస్థితిపై డాక్యుమెంటేషన్ రూపొందించాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, టిజిఈ డబ్ల్యూఐడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, టిజి ఎమ్మెఎస్ ఐడిసి ఎగ్జిట్ ఇంజనీర్లు చలపతిరావు, డిప్యూటీ ఐవోఎస్‌లు, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సమస్యను పరిష్కరించాలని ఎండికి వినతి




కరెంటు సమస్యను పరిష్కరించాలని కోరుతూ టిజిఎస్‌పిడిసిఎల్ ఎండికి వినతిపత్రం ఇచ్చిన కాపీని చూపిస్తున్న వట్టినాగులపల్లి గ్రామస్థులు

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** గండిపేట మండలం వట్టి నాగులపల్లి గ్రామంలో కరెంటు సమస్యను పరిష్కరించాలని కోరుతూ టిజిఎస్‌పిడిసిఎల్ ఎండికి గ్రామస్థులు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు గణేష్‌సింగ్ మాట్లాడుతూ వట్టినాగులపల్లి గ్రామంలో కొత్త విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు మాకు క్యాటగిరి-1 గాని, డొమెస్టిక్‌గాని ఇవ్వకుండా క్యాటగిరి-8 టెంపర్వరీ మీటరును ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మీటర్లను బిగించు కుంటే కరెంటు బిల్లులు వేలల్లో వస్తున్నాయని, అధిక మొత్తంలో వచ్చే బిల్లులు చెల్లించలేక మా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేకమార్లు మా సమస్యను ఏఈ, డిసిల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని, అందుకే ఎండి దృష్టికి తీసుకు వచ్చామని పేర్కొన్నారు. మా ఇళ్లకు మున్సిపల్ నుంచి అనుమతులు ఉన్నాయని, ఆస్థి పన్నులు చెల్లిస్తున్నామని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇసిలు అన్నీ ఉన్నా మాకు ఎందుకు క్యాటగిరి-8 మీటర్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని, లేదంటే కోర్టును ఆశ్రయిస్తామని గణేష్‌సింగ్, స్థానికులు మేకల లక్ష్మారెడ్డి, కృష్ణ యాదవ్, రాఘవేంద్ర చారీ, సంతోష్, మహేష్ యాదవ్, సుధీర్ సింగ్, మహేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### మంచిరేవులలో మైనార్టీ స్మశాన వాటిక పనులు ప్రారంభం

**- నార్సింగి చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్**



మంచిరేవుల గ్రామంలో రూ.30.లక్షలతో చేపడుతున్న మైనార్టీల స్మశాన వాటిక పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ.

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :**
మంచిరేవుల గ్రామంలో మైనార్టీల స్మశాన వాటిక పనులు ప్రారంభించామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని వివరించారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మంచినీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు, జిమ్‌లు ఇలా అన్ని రకాల మౌళిక వసతులను వేగంగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి విషయంలో రాజీ పడడం లేదని, కుల,మత,పార్టీలకు అతీతంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ లంకల పద్మా వీరా రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి లంకల పాపిరెడ్డి, బుచ్చిరెడ్డి, దొబ్బ లక్ష్మణ్, దొబ్బ భాస్కర్, అఫ్జల్, అక్బర్, ఆజాం, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించాలి

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా**




సమావేశంలో ప్రసంగిస్తున్న సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ట్రాఫిక్ వ్యవస్థను పునఃవ్యవస్థీకరించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ ట్రాఫిక్ నియంత్రణను విస్మరించి, ప్రజల జేబులు లూటీ చేసే సంస్థగా మారిందని ఆరోపించారు. అభివృద్ధి మీద దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం కేవలం ఖజానా నింపుకోవటం కోసం కొత్త కొత్త ట్రాఫిక్ ననిబంధనల పేరుతో సామాన్యుల జేబులు కొల్ల గొడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించకుండా, ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేసి ట్రాఫిక్ పోలీసులంతా కేవలం ఫొటోలు తీయడం, చలానాలు రాయడమే డ్యూటీ అన్నట్లు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. గతుకుల రోడ్లు, గుంతల రోడ్లను, అస్తవ్యస్థంగా ఉన్న ట్రాఫిక్‌ను గాలికి వదిలేసి, కేవలం చలాన్ల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేస్తూ, సామాన్యుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. కేవలం డబ్బే పరమావధిగా ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ ఉంటే ప్రజలే తిరిగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, మేడిపల్లి శ్యాం, జి.యాదగిరిరావు, భవాని శ్రీనివాస్, కృష్ణస్వామి, వి.రామారావు పాల్గొన్నారు.

### పిఎంఓ కార్యాలయం స్పందించడం పట్ల హర్షం

**సైఫాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పేద ప్రజలకు అన్ని ఆసుపత్రులలో వైద్యం లభించేలా తగు చర్యలు తీసుకోవాలని, ఈ పథకం గురించి ప్రజలకు మరింతగా వివరించాలని తాను చేసిన విజ్ఞప్తికి పిఎంఒ కార్యాలయం స్పందించడం పట్ల బిజెపి ఓబిసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ఇటీవల పిఎంఒ కార్యాలయంకు లేఖ రాయడం జరిగిందన్నారు. దీనికి పిఎంఒ కార్యాలయం స్పందించిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశ్రీ జనరల్ మేనేజర్ డాక్టర్ రవిశంకర్ తనకు ఫోన్ చేసి అభినందించారని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే కోట్లాది మందికి ప్రయోజనం చేకూరిందని, అయితే ప్రజలకు మరింతగా అవగాహన కల్పిస్తే బాగుంటుందన్నారు.

## బిసిల సమస్యలను పరిష్కరించుకునే దిశగా పోరాటం చేస్తాం

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :**
బీసిల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించుకునే దిశగా తామంతా ఐక్యతగా పోరాటం చేస్తామని పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ అన్నారు. గురువారం వివేకానందనగర్ కాలనీకి చెందిన కె.సత్యనారాయణ(బాబి)ను తెలంగాణ రాష్ట్ర బిసి ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేశారు. అందుకు గాను కాలనీలో మేడ్చల్ మల్కాజిగిరి కార్యదర్శి పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ ఆధ్వర్యంలో సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో బీసిల సమస్యల పట్ల సంఘటితంగా పోరాటం చేసి పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపి ప్రధాన కార్యదర్శి బొంతు హరికృష్ణ, బిసి సెల్ అధ్యక్షుడు కమ్మరి రామకృష్ణ, బిజేవైయమ్ అధ్యక్షులు భాను, పాల్గొన్నారు.

### ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయండి

**-మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నరేందర్‌గౌడ్ వినతి**

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**
బిసి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం బిఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా దాదాపు 5వేలకోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం విద్యాసంస్థలకు సకాలంలో అందజేయకపోవడం వల్ల అనేక విద్యాసంస్థల్లో చదువుకునే బిసివిద్యార్థులను ఆయా విద్యాసంస్థల వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి వారికి వెంటనే రియంబర్స్‌మెంట్ మంజూరు చేయాలని కోరారు. అలాగే పోటీ పరీక్షల ద్వారా వృత్తివిద్యాకోర్సుల్లో ఎంపికైన విద్యార్థులందరికీ కూడా ప్రభుత్వమే ఫీజులు చెల్లించాలని కోరారు. అలాగే 10వేల ర్యాంక్ క్యాప్ పద్దతిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

### సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పు అభినందనీయం

**-తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు కూడా భరణానికి అర్హులేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పు అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన చేస్తూ దేశంలోని ముస్లి మహిలల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని, వారి బాధను గుర్తించిన సుప్రీంకోర్టు మతం వల్ల వచ్చిన హద్దులను చెరిపి వేసిందని అన్నారు. సీఆర్‌పీసీలోని సెక్షన్ 125ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింప చేయకపోతే అది రాజ్యాంగంలోని అధికరణం 15(1) ఉల్లంఘన క్రిందకే వస్తుందని, కులం, మతం, లింగం, ప్రాంతం ఆధారంగా ఏ పౌరులపైనా కూడా వివక్ష చూపకూడదు కాబట్టి సెక్షన్ 125 ప్రకారం త్రిపుల్ తలాక్ లాంటి అక్రమ పద్ధతుల్లో విడాకులు తీసుకున్నా కూడా ముస్లిం మహిళలకు భరణం కోరే హక్కు ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు. భరణాన్ని దానంగా చూడకూడదని, లింగ సమానత్వానికి దోహదం చేసే అంశమని, ఇది లౌకిక నిబంధన అని, ముస్లిం మహిళలు ఇందుకు మినాహాఇంపు కాదని స్పష్టం చేశారు. గతంలో హిందూ న్యాయవాదులు ముస్లింలకు ప్రత్యేక చట్టాలున్నందున వారి కేసులు చేయటానికి వెనుకడుగు వేసేవారని, ఈ తీర్పుతో దేశంలోని మహిళలందరికీ ఒకే చట్టం వర్తిస్తుందని, చట్టానికి అందరూ సమానమేనని స్పష్టం చేయటంతో న్యాయవాదులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బిజెపి అభ్యున్నతికి స్వర్గీయ చంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం: ఈటల రాజేందర్

**కుత్బుల్లాపూర్, జూలై 11 ప్రభాతవార్త**
నిరుపేదల సేవకు తనజీవితాన్ని ధారపోసిన స్వర్గీయ చంద్రారెడ్డి చిరస్మరనీయులని మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. స్వర్గీయ చెరుకుపల్లి చెంద్రారెడ్డి వర్ధంతిని పుర్కరించుకుని కుత్బుల్లాపూర్ డివిజన్ సుదర్శన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ తారాచంద్రారెడ్డితో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా మేడ్చెల్‌జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చెరుకుపల్లి భరత్‌సింహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బిఎపి మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్.ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ బిజెపిపార్టీద్వారా అనేక బస్తీలను ఏర్పాటుచేసి నిరుపేదలకు అండగా స్వర్గీయ చెంద్రారెడ్డి చేసిన త్యాగం చిరస్మరనీయమన్నారు. కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి మాట్లాడుతూ నిరుపేదల పక్షాన నిలిచి పార్టీఅభ్యున్నతిలోనే ప్రాణత్యాయం చేసిన మహనీయులు స్వర్గీయ చంద్రారెడ్డి అనకొనాయాడారు. కార్పొరేటర్ రావుల శేషగిరిరావు మాట్లాడుతూ పార్టీకోసం అహర్నిశలూ కృషిచేసిన చంద్రారెడ్డి ఆదర్శుఆయులన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ యువజన విభాగం నాయకులు, పార్టీ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షులు చెరుకుపల్లి భరత్‌సింహ్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిజెపి కన్వీనర్ జె.కె.శేఖర్‌యాదవ్, ఓబిసి నాయకులు ఒక్కంటి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి : ఎమ్మెల్యే




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

**చార్మినార్, జూలై 11 ప్రభాతవార్త :** పాతబస్తీ బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలనిఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. పాతబస్తీ నర్కి పూల్‌బాగ్‌లోని చార్మినార్ జోనల్ కార్యాలయంలో గురువారం బహదూర్ పురనియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి నిర్మాణ పనుల నిర్వాహణ, పురోగతిపై ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు మహ్మద్ అబ్దుల్ ముక్తాదిర్, మహ్మద్ ఖాదర్ అధికారులు పాల్గొన్నారు.

# దోమల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

**-విష జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు**
**-ప్రజలు ఎవరికి వారు తగిన జాగ్రత్తలు పాటించాలి**
**ప్రతి యాబై ఇళ్ళకు ఓ అధికారిని నియమించి అవగాహన కల్పిస్తాం : అనురాగ్ జయంతి**

**పంజగుట్ట, జూలై 11 ప్రభాతవార్త:**
దోమల నియంత్రణతో పాటు డెంగ్యూ వ్యాధిబారి నుండి ప్రజలను కాపాడడానికి పటిష్టమైన కార్యాచరణ విధివిధానాలను తయారు చేసినట్లు ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి వెల్లడించారు. ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలు వివరించారు. విష జ్వరాలను అడ్డుకునేందుకు జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాలను భాగస్వామ్యం చేసినట్లు ఆయన తెలిపారు. నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న డెంగీకేసులు సమీప రోజుల్లో పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జోన్ పరిధిలోని ప్రతి యాబై నివాసాలకు ఓ అధికారిని లేదా ఓ ప్రతినిధిని నియమించి ఆయా ఇళ్ళ వద్ద దోమలపై అవగాహన కల్పించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ రోజు నుండి మూడు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల వద్ద దోమల నియంత్రణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఇంటింటి సర్వే కూడా చేయడం జరుగుతుందని తెలిపారు. తమ పరిధిలో మలేరియా విభాగం అధికారులు ఎప్పటికపుడు జ్వర సర్వే చేసిన నివేదికల ఆధారంగా ఉన్నతాధికారులు ఏఏప్రాంతాలలో జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయో అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యూసీడీ విభాగంతో పాటు అన్ని విభాగాలఅధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. అదేవిధంగా తల్లిదండ్రులు స్కూలుకు వెళ్ళే తమ పిల్లలు తప్పనిసరిగా మాస్క్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులతో పాటు వాలంటీర్‌ల సేవలను కూడా ఉపయోగించుకుంటామని, ఆయా ప్రాంతాలలో ఉన్న కాలనీ అసోసియేషన్‌లను కూడా డెంగ్యూ నివారణ చర్యలలో భాగస్వామ్యులను చేస్తామన్నారు. చెరువులు, కుంటలు, కాలువలపై ప్రత్యేక దృష్టిపెట్టి పీరియాడిక్ క్లీనింగ్ ఉండేలాచూస్తామన్నారు. అదే సమయంలో ఫాగింగ్ కూడా పకడ్బందీగా చేస్తామని తెలిపారు. ఖైరతాబాద్ జోన్‌లో ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 51 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ముందుగా పాఠశాలలు తర్వాత అన్ని ప్రభుత్వ విభాగాలపై దృష్టి పెట్టటం జరుగుతుందన్నారు.

# సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాలి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ వాసవి బృందావన్ గ్రేటర్ కమ్యూనిటీలో పర్యటించి ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా పర్యటిస్తున్నామని అపార్టుమెంటులు, బస్తీలలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో వేల సంఖ్యలో అపార్టుమెంటులు, బస్తీలు ఉన్నాయని దశల వారిగా పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో పెద్ద పెద్ద అపార్టుమెంటులు గ్రేటర్ కమ్యూనిటీలు పెరుగుతున్నాయని హైదరాబాద్ దేశంలోనే అభివృద్ధి చెందిన నగరంగా పేరొందిందన్నారు. అదేవిధంగా నగరంలో ఐటి సెక్టార్, ఫార్మ సెక్టార్, డిఫెన్స్ సెక్టార్, హెల్త్ సెక్టార్‌లుగా వృద్ధి చెందగా వాటికి మౌళిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పరచాలన్నారు. రానున్న



ఎర్రగడ్డ వాసవి బృందావన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రోజుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా దేశ ప్రధాని మోదీ నాయకత్వంలో ఐదవ అతిపెద్ద అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు వెళ్లడం జరిగిందని 2047 ను టార్గెట్‌గా వేసుకుని ప్రపంచంలోనే వృద్ధి చెందిన దేశంగా వికసిత్ భారత్ పేరుతో ముందుకు వెళుతున్నామన్నారు. 2027వరకు ఐదవ స్థానం నుండి మూడవ స్థానానికి రావాలని ఆకాంక్షించారు. మోడీ నాయకత్వంలో పేద వాడికి టాయిలెట్స్ నుండి చంద్ర గ్రహణం వరకు కూడా వృద్ధి చెందడం జరిగిందన్నారు. తాను మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా గెలుపొంది నీతి, నిజాయితీగా పనులు చేపట్టడం జరుతుందని తాను ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ అహర్నిశలు ప్రజా సమస్యల కోసం పోరాడుతున్నామన్నారు. అనంతరం యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహా నగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి బస్తీలలో పాదయాత్ర చేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా ఆయా సంబందిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గౌతమ్‌జి రావు, జూబ్లీ హిల్స్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే లంకల దీపక్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కుంభాల గంగరాజు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, రాజేష్, జూటూరి కీర్తిరెడ్డి, డాక్టర్ వీరపనేని పద్మ, వాసవి బృందావనం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ వీరయ్య గుప్త, ఉపాధ్యక్షులు సుబ్బ రాజు, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధి కారి కెఎస్ఆర్ శ్యామ్ సుందర్, కమిటీ సభ్యులు భాస్కర శర్మ, శ్యామ్ బాబు, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, పికె మొహంతి, పవన్‌కుమార్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య..

**జీడిమెట్ల, జూలై 11, ప్రభాతవార్త**
ఇంట్లో ఉన్న బంగారు నగలు కొదవ పెట్టినందుకు అమ్మమ్మ మందలించడంతో మనస్థాపానిక గురైన మనవడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జ్యోతుల మమత, జె. నాగరాజు భార్యభర్తలు కుత్బుల్లాపూర్‌లోని సూరారం, తెలుగుతల్లి నగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా గతంలో కొన్ని అప్పుల కారణంగా నాగరాజు పెళ్లి సమయంలో నాగరాజు భార్య మమతకు పెట్టిన బంగారును కుదవ పెట్టిడంతో నాగరాజు అమ్మమ్మ మందలించింది. దీంతో నాగరాజు మనస్థాపనికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సహాయంతో మమత నాగరాజును హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని డ్యూటీ డాక్టర్ నిర్ధారించారని, ఈ మేరకు మమత భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహిత అదృశ్యం..

**పేట్ బషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త**
ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్న ఊర కాశిరామ్, శివరెడ్డి నగర్‌లోని స్వీట్ కంపెనీలో పని చేసే ఊర స్వరూపలు (22) తమ ఇద్దరి పిల్లలతో కలిసి కుత్బుల్లాపూర్ జయ రాం నగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం ఎప్పటిలాగానే స్వ రూప పనికి వెళ్ళింది. రాత్రి 7 గంటల కు రావల్సిన స్వరూప ఎంతకి రాకపోవడంతో భర్త కాశీరాం భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ అని వచ్చింది. కంపెనీకి వెళ్లి అడుగగా డ్యూటికి రాలేదని, జ్వరంగా ఉందని చెప్పిందని తెలిపారు. చుట్టు ప్రక్కలవారిని, తెలిసినవారిని, బంధువులను, స్నేహితులను అడిగినా ఆమె ఆచూకి తెలియడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డబ్బు వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై కేసులు

**-కొత్త చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన మియాపూర్ ఏసిపి**

**సైబరాబాద్ ప్రతినిధి, జూలై 11 ప్రభాతవార్త**
నకిలీ ప్రెస్ కార్డులు చూపించి, నిర్మాణదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులు, రాజకీయ నాయకుల మీద కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మియాపూర్ ఏసిపి నర్సింహ రావు ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నచిన్న నిర్మాణదారులు, వ్యాపారస్థుల వద్ద పలువురు నకిలీ ప్రెస్‌కార్డులు చూపించి రిపోర్టర్లమంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని, కొందరు రాజకీయ నాయకుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని తమకు పిర్యాదులు అందాయన్నారు. పలు ప్రాంతాల నుంచి ఇదే తరహా పిర్యాదులు రావడంతో వారిపై రహస్య విచారణ చేపట్టి, కొందరిని గుర్తించి నివేదికలు సిద్దం చేశామన్నారు. అతిత్వరలో వారి మీద కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాల ప్రకారం ఆర్గనైజ్‌డ్ క్రైమ్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటువంటి బెదిరింపులతో ఇబ్బందులు పడే వారు తమకు సమాచారం అందించాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. బాధితులు పిర్యాదు చేసిన 24 గంటల్లో కొత్త చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని, పార్టీలకు అతీతంగా బెదిరింపులకు పాల్పడిన వారు ఎంతటివారైనా కొత్తచట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణదారులు, వ్యాపారస్థులు చట్టప్రకారం సరైన అనుమతులు అధికారుల నుంచి తీసుకొని నిర్మాణాలు, వ్యాపారాలు చేసుకోవాలని, అనుమతితో కూడిన వ్యాపారం, నిర్మాణదారులకు పోలీసుల రక్షణ ఉంటుందని అన్నారు. గతకొంత కాలంగా గుర్తింపులేని యూట్యూబ్ ఛానల్ పేరుతో తాము జర్నలిస్టులమంటూ నిర్మాణదారులను బెదిరిస్తున్నారని, కొందరు ట్రూకాలర్‌లో విజిలెన్స్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులుగా పేర్లు పెట్టుకొని బెదిరిస్తున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. చట్టవ్యతిరేఖ చర్యలకు పాల్పడే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ పోలీసులకు సమాచారం అందించాలని, పోలీసులు బాధితులకు రక్షణ కల్పిస్తారని అన్నారు.

## కాలనీలో స్మశాన వాటిక వద్దంటున్న స్థానికులు

**- కాలనీ వాసులకు మద్దతు తెలిపిన బిజెపి నాయకులు**

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :**
ప్రజా ప్రతినిధులైనా, అధికారులైనా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైన చర్య కాదని బిజెపి రాజేంద్ర నగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఓ వర్గం వారిని సంతృప్తి పరిచేందుకు మరో వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తామంటూ ఊరుకునేది లేదన్నారు. రూ.కోట్లు వెచ్చించి ఇళ్లు కొని, నిర్మించుకొని ఉంటున్న ప్రజలను పట్టించుకోకుండా ఏకపక్షంగా మునుపెన్నడూ లేని స్మశాన వాటికను ఇప్పుడు బలవంతంగా నిర్మిస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అనేకమార్లు విఘ్నేశ్వర కాలనీ ప్రజలు ఇక్కడ స్మశాన వాటిక నిర్మాణం చేపట్ట వద్దని కార్పోరేటర్‌కు, డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా వారు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. కాలనీలోని 99.శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నా ఎందుకు మొండి పట్టు పట్టి, పోలీసులను పెట్టి స్మశాన వాటిక పనులు చేపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అండగా నిలువాలని, ఇలా ఓ వర్గంను సంతృప్తి పరిచేందుకు బలవంతంగా పనులు చేపట్టడం విరమించుకోవాలని సూచించారు. ఈ 17.గుంటల భూమిలో అన్ని మాతాల వారు ఉపయోగించుకునేలా పార్కును ఏర్పాటు చేయాలని తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాదని మొండిగా స్మశాన వాటిక పనులు ప్రారంభిస్తే అడ్డుకొని తీరుతామని, న్యాయ పరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మహాలింగంగౌడ్, మహేష్ యాదవ్, శేఖర్‌రెడ్డి, లక్ష్మీ నర్సహ్మా, శివలీల, భువనేశ్వరి, అనురాధ, శ్రీనివాస్, ప్రవీణ్, పవన్‌సాయి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



గంధంగూడలోని విఘ్నేశ్వర కాలనీలో స్మశాన వాటిక పనులు వద్దని ఆందోళన చేస్తున్న స్థానికులకు మద్దతు తెలుపుతున్న బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి.

## పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టేందుకు మజ్లిస్ చొరవ తీసుకోవాలి



అసదుద్దీన్ ఓవైసితో ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

**అసదుద్దీన్ ఓవైసీతో ఎంపి ఆర్.కృష్ణయ్య చర్చలు**

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**
పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టాలని అందుకు మజ్లిస్ పార్టీ చొరవ తీసుకోవాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీని కోరారు. ఈమేరకు గురువారం తమ ప్రతినిధి బృందంతో కలిసి దారుసలాంలోని ఓవైసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76సంవత్సరాలు గడిచిన బిసిలకు రాజ్యాంగ బద్దమైన ,ప్రజాస్వామ్యమైన హక్కులు కల్పించలేదన్నారు. బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక, సామాజిక రంగాలల్లో జనాభా ప్రకారం వాటా దక్కడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం బిసి వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఏరంగంలో కూడా సముచిత స్థానం దక్కకుండా చేస్తుందని ఆరోపించారు. దేశంలో అనేక సెంటిమెంట్లతో ఇంకా బిసిలను తప్పుదారి పట్టించడం, మభ్యపెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయ రంగంలో బిసిల ప్రాతినిథ్యం 14శాతం దాటలేదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. దీన్ని బట్టి బిసిలకు దేశంలో జరుగుతున్న అన్యాయాలను గుర్తించాలన్నారు. ఈసందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ స్పందిస్తూ మజ్లిస్ పార్టీ తరపున పార్లమెంట్‌లో ప్రైవేట్ బిసి బిల్లు పెడతామని హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, అనంతయ్య, రాజేందర్, కోలా జనార్ధన్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అస్సలు సిసలైన గాంధేయ వాది మల్లికార్జునశర్మ

**- మాజీ ఎంపి వి.హనుమంతరావు**

**రవీంద్రభారతి, జూలై 11 ప్రభాతవార్త :**
సర్వెంట్ ఆఫ్ ఇండియాగా ప్రఖ్యాతిగాంచిన డా. ఉప్పులూరి మల్లికార్జునశర్మ గాంధేయవాది, నిరాడంబర రాజకీయవేత్త, అజాతశతృవు అన్నింటికీమించి అస్సలు సిసలైన కాంగ్రెస్ వాది అన్న ప్రముఖ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు తన ఆఖరి శ్వాస వరకు కాంగ్రెస్ విధేయుడిగా జీవించిన మహోన్నతవ్యక్తి అని అన్నారు. శర్మ తన మాట, పాటల రూపంలో దేశ భక్తిని ప్రదర్శించేవారని గుర్తుచేశారు. ఏపిలో కూడా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో జానకి మల్లికార్జున చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన డా. ఉప్పులూరి మల్లికార్జునశర్మ 86వ జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.హనుమంతరావు విశిష్ట అతిథులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వి.పి. రామచంద్ర రావు, ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ, సీనియర్ రాజకీయ నాయకులు దయానంద్, రాజలింగం, రాజశేఖర్, బ్రాహ్మణ సంఘం అధినేత రాఘురామయ్య, హైకోర్టు న్యాయవాది, ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మల్లికార్జునశర్మ కుమారుడు ఉప్పులూరి శ్రీనివాసశర్మ తదితరులతో కలిసి మల్లికార్జునశర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించారు. అనంతరం వక్తలు మల్లికార్జునశర్మ ఏపి ప్రభుత్వ మద్య విమోచన ప్రచార కమిటీ అధ్యక్షుడుగా, రవీంద్రభారతి కార్యదర్శిగా చేసిన అనేక సేవలను కొనియాడారు. సభకు ముందు ఆధ్యాత్మిక, దేశభక్తి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు; అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు; కళాకారులచే జుగల్‌బందీ అద్భుత ప్రదర్శనలు కావించి ఆకట్టుకున్నారు.



మల్లికార్జునశర్మకు ఘననివాళులర్పిస్తున్న వి.హనుమంతరావు, కెవిపి, ఓలేటి, దైవజ్ఞశర్మ, శ్రీనివాసశర్మ తదితర ప్రముఖులు

## సికింద్రాబాద్‌లో స్టెరాయిడ్స్ స్వాధీనం

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:**
డ్రగ్ కంట్రోల్ అధికారు లు సికింద్రాబాద్‌లో భారీ మొత్తంలో స్టిరాయిడ్స్‌ను పట్టుకున్నా రు. వాటిని సరఫరా చేస్తున్న నిందితుడు ఖాసింని అరెస్ట్ చేశా రు. జంటనగరాల్లో వీటి సరఫరా విరివిగా జరుగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ముఖ్యంగా బాడీ బిల్డింగ్ చేసే వారు వీటిని వాడతారని, సిటీలోని జిమ్‌లను టార్గెట్ చేసి వీటిని విక్రయిస్తారని తెలిపారు. ఈ క్రమంలో ముందస్తు సమాచారం అందడంతో సికింద్రాబాద్ ప్రాంతంలోని పలు జిమ్‌ల వద్ద నిఘా పెంచిన డ్రగ్ కంట్రోల్ అధికారులు నిందితుడు ఖాసింని అరెస్ట్ చేశారు. నిందితుడు మరికొందరి ముఠాను ఏర్పరిచి ఎంతో కాలంగా కొందరు యువకులకు గుట్టుగా స్టిరాయిడ్స్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. స్టిరాయిడ్స్‌ని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వైద్యులు మాత్రమే సూచిస్తారని, రక్తానికి అవి ఉత్ప్రేరకంగా పనిచేసి రోగనిరోధక శక్తిని తగ్గిస్తాయని చెప్పారు. కేసు నమోదు చేసిన పో లీసులు నిందితుడిని పూర్తి స్థాయిలో విచారిస్తు న్నామన్నారు.

## పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కాలర్ పట్టుకున్న మహిళ

**- భార్య భర్తలు రిమాండ్‌కు తరలింపు**

**అల్వాల్, జూలై 11 ప్రభాతవార్త:**
విది నిర్వహణలో ఉన్న ఎస్ఐ కాలర్ పట్టుకున్న మహిళతో పాటుగా ఆమె భర్తను అల్వాల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఓల్డ్‌అల్వాల్, గణేష్ ఎన్‌క్లేవ్‌లో శిల్ప(40) వెంకటేశ్వర రావు(45) నివాసం ఉంటున్నారు. వీరి ఇంటికి ఎదురుగా ఉంటున్న పవన్ కుటుంబంతో చెత్త, కుక్క విషయంలో వీరికి తరుచు చిన్నపాటి గొడవలు గత కొంత కాలంగా సాగుతున్నాయి. వెంకటేశ్వరరావు పెంపుడు కుక్క తరుచు పవన్ ఇంటి గోడపై మూత్ర విసర్జన చేస్తుండడం తమ వైపు ఉన్న చెత్తను ఎదురు ఇంటి వైపు వేయడం జరిగింది. ఈ విషయమై పవన్ పలుమార్లు తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసినా భార్య భర్తలు పట్టించుకోలేదు. గత్యంతరం లేని పరిస్థితిలో పవన్ అల్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరు కుటుంబాలను బుదవారం ఎస్ఐ సురేష్ పోలీసు స్టేషన్‌కు పిలిచారు. ఎదుటి ఇంటి వైపు చెత్త వేయడం, కుక్కతో గోడలుపై మూత్ర విసర్జన చేయించడం మానుకోవాలని ఎస్ఐ భార్య భర్తలు వెంకటేశ్వరరావు, శిల్పలకు చెప్పారు. కోపోద్రిక్తురాలైన శిల్ప నువ్వు ఎంత నీ బతుకు ఎంత అని ఎస్ఐ కలర్ పట్టుకుంది. భార్య భర్తలు ఇరువురు అసభ్య పదజాలంతో దూషించడం జరిగింది. విది నిర్వహణలో ఉన్న అధికారిపై దౌర్జన్యానికి దిగిన ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నియోజకవర్గంలో పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



పార్కులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, జూలై 11 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గంలో అన్ని పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని షోయబ్ మెమోరియల్ పార్కులో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుల నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రార్, అధికారులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యనగర్ బస్తీలో స్థానిక సమస్యలపై డిప్యూటీ మేయర్‌కు మహిళల వినతి



వినతిపత్రాన్ని తీసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, జులై 11 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ పరిధిలోని ఆర్యనగర్ బస్తీలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పలువురు బస్తీ మహిళలు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా బస్తీలో గుంతలమయంగా రోడ్లు ఉన్నాయని, పారిశుధ్య సమస్య, డ్రైనేజీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహిళలు డిప్యూటీ మేయర్‌ను కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరస్తామని చెప్పారు.

## రాచకొండ పోలీస్ కమీషనర్‌గా సుధీర్‌బాబు

**నేరేడ్‌మెట్, జూలై 11, ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనర్‌గా 2001 బ్యాచ్‌కు చెందిన జి.సుధీర్ బాబును నియమిస్తు బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తరుణ్ జోషిని బదిలీ చేసి తిరిగి సుధీర్‌బాబును రాచకొండ కమీషనర్‌గా నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లో ఏర్పడిన రెండవ వారంలో సుధీర్‌బాబును కమీషనర్‌గా నియమించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి రెండవ వారంలో ప్రభుత్వం సుధీర్‌బాబును బదిలీ చేసి తరుణ్ జోషికి బాధ్యతలు అప్పగించింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో తిరిగి సుధీర్‌బాబుకు బాధ్యతలు అప్పగించింది. ఉత్తర్వులు వెలవడిన కొన్ని గంటల్లోనే నేరేడ్‌మెట్‌లోని కమీషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

**సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కమీషనర్ సుధీర్‌బాబు..**

రాచకొండ పోలీస్ కమీషనర్‌గా బాధ్యతలను చేపట్టిన సుధీర్ బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాపూర్వకంగా కలిసారు. రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో శాంతి భద్రతలను అదుపులో ఉంచడానికి కృషి చేస్తానన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం

**సైదాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో చంపాపేట డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. శుభోదయ కాలనీ రోడ్డు నెం.10లో గత రెండు వారాలుగా వీధి దీపం వెలగడం లేదని, డ్రైనేజీ పొంగి పొర్లుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తెలపడంతో సమస్యను పరిశీలించి, ఎమ్మెల్యే సహకారంతో సంబంధిత అధికారులు, సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరించడం జరిగిందని రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ మాజీ సభ్యుడు శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యుజిడి నిర్మాణంకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, జూలై 11 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ సంజయ్ గాంధీనగర్ లెప్రసికాలనీలో బోరు పాడైందని స్థానికులు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ జలమండలి మేనేజర్ కలిసితో కలిసి పరిశీలించి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్, బాబు, అరుణ్, కిషోర్, అబ్దుల్ మజీద్, మధుగౌడ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మహంకాళి అమ్మవారి బోనాల నిర్వహణ

**మల్కాజిగిరి, జూలై 11 ప్రభాతవార్త :** మల్కాజిగిరిలో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు గుడి వద్ద అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసారు. యడం జరిగింది అని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, డి.సి రాజు, కార్పొరేటర్ శ్రవణ్, డిఇ శ్రీశైలం, ఏడిఈ యాదగిరి, హార్టికల్చర్ మహేశ్వరి, వాటర్ వర్క్స్ డిజిఎం ఆశ్రీత, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి : ఎసిపి శంకర్‌రాజు



ట్రాఫిక్‌నియమాల గురించి అవగాహన కల్పిస్తున్న సిపి శంకర్ రాజు

**మలక్‌పేట, జూలై 11 ప్రభాతవార్త :** ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఎసిపి శంకర్‌రాజు పేర్కొన్నారు. మలక్‌పేట యశోద హాస్పిటల్, వైద్య సిబ్బంధికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత అని విధిగా అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమములో రిటైర్డ్ డిసిపి దివ్య చరణ్, ఆసుపత్రి జిఎం గోపాల్‌రావు, ఎజిఎం హేమ, చంద్ర, రాజశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభించనున్న ప్రభుత్వం: ప్రొఫెసర్ కోదండరాం



తెలంగాణ ఇంజనీర్స్ డేకు హాజరైన ప్రొఫెసర్ కోదండరాం

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రభుత్వం ప్రారంభించనున్నదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వెల్లడించారు. నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన తెలంగాణ ఇంజనీర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కాలేజీల్లో విద్యాబోధనతోపాటు మార్పుకు తగ్గట్టుగా కొత్త టెక్నాలజీని బోధించాలని ఆయన సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యా రంగంలో ఊహించని మార్పు చేస్తుందని పేర్కొన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఆరంభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ పివిఆర్ కశ్యప్, వాసుదేవరావు, జూపూరి సుధాకర్, ప్రభాకర్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌జిఎస్ మూర్తి, డీన్‌లు ప్రొఫెసర్లు వర్ధిని, ప్రసన్నకుమార్, గజానన, వేణుగోపాలరావు, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, మీడియా చీఫ్ కో-ఆర్డినేటర్ బొడ్డుపల్లి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 11 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని రామాలయం బస్తీలో రూ.4లక్షలతో, గడ్డిఅన్నారం బస్తీలో రూ.30లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేపర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రవికాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఎలు గణేష్, మజీబ్, సుభాష్, శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, సురేందర్, ప్రభాకర్, అమిత్, జీవన్, కిరణ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా శ్రీ వారాహిదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

**ఎల్.బి.నగర్, జూలై 11 ప్రభాతవార్త:** శ్రీవారాహిదేవి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆర్కేపురంలోని కుర్తాల పీఠం ఆదిపరాశక్తి శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శ్రీవారాహిదేవి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కార్యదర్శి మునిపల్లె శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలలో భాగంగా విశేషాలు కుంకుమార్చనలు, పారాయణం, మహానక్షత్ర హారతులు తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ పోచమ్మ ఆలయంలో శ్రీ వారాహి తాంత్రిక నవరాత్రి ఉత్సవాలు

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని పోచమ్మదేవి ఆలయంలో శ్రీ వారాహి తాంత్రిక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఎల్‌బినగర్‌కు చెందిన శ్రీ ప్రత్యంగరిరా దేవి తాంత్రిక పీఠం స్వామి శ్రీ సుందర నంమూర్తు అయ్యార్ స్వామి మంగళ శాసనములతో పోచమ్మ ఆలయ కమిటీ వారు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి చెందిన పలువురితో పాటు కొందరు కుటుంబ సమేతంగా హోమాలు నిర్వహించారు.

## సిల్వర్ డ్రాప్స్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** జిల్లెలగూడలో సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ప్లాస్టిక్ నిషేధం వల్ల కలిగే ఉపయోగాలను నినదిస్తూ ర్యాలీ జరిపారు. ఈ మేరకు ప్రజలు చైతన్యవంతులై ప్లాస్టిక్ వాడకం ఆపేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల 14న రేణుకా ఎల్లమ్మ కళ్యాణం

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** జిల్లెలగూడ శ్రీ సత్యసాయినగర్ కాలనీలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఈ నెల 14న ఆదివారం అమ్మవారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం 13వ తేదీన సాయంత్రం గంగతెప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఆదివారం ఉదయం 11 గంటలకు అమ్మవారి కళ్యాణాన్ని జరుపుతారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు ముదిరాజ్ తెలిపారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు...

**తుర్కయంజాల్, జూలై 11 ప్రభాతవార్త:** 11కెవి ఫీడర్లకు అంతరాయం చెట్ల తొలగింపు కారణంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో 11 గంటల నుండి 11:30వరకు ఆదిత్యనగర్, టీచర్స్ కాలనీ, గుర్రంగూడా పరిసర ప్రాంతాలు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, అదే విధంగా మన్నెగూడ పీడర్, ఎంఎంకుంట, ఎన్ఎస్ఆర్‌నగర్, ఆర్టిఏ పరిసర ప్రాంతాల్లో కూడా విద్యుత్ నిలిపివేయడుతుందని విద్యుత్ అధికారి ఏ.ఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో స్వల్ప వ్యవధిలో అంతరాయం ఏర్పడుతుందని కాలనీవాసులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## మహాలక్ష్మి అమ్మవారి మకర తోరణానికి విరాళం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మల్కాజిగిరి, జూలై 11 ప్రభాతవార్త :** యాదవనగర్ సిద్ధి వినాయక ఆలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, సతీమణి మర్రి మమత దంపతులు గురువారం కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారికి మకర తోరణానికి 75 వేల రూపాయలను విరాళంగా ఆలయ ప్రతినిధులకు అందజేశారు. అదేవిధంగా కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ సైతం అమ్మవారి మకర తోరణానికి 11 వేల 116 రూపాయలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, మేకల రాముయాదవ్, నాయకులు జెఏసి వెంకన్న, శ్రీరాములు యాదవ్, కిట్టు, నర్సింగ్‌రావు, భైరు అనిల్, లక్ష్మణ్‌యాదవ్, అనిత, శైలజ, లీల తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో రూ. 77 లక్షల 30వేలతో రోడ్ల నిర్మాణ పనులు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్ తదితరులు

**వనస్థలిపురం, జూలై 11 ప్రభాతవార్త :** గత ప్రభుత్వ హయాంలో హనుమాన్ నగర్‌లో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినప్పటికీ నిధుల కొరతవల్ల పనులు ఆగిపోయాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. రూ. 77 లక్షల 30 వేలతో రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించిచామని, డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఇటీవల జిహెచ్ఎంసి వాటర్‌వర్క్స్ అధికారులతో సమావేశం నిర్వహించి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ హేమునాయక్, సిబ్బంది, కాలనీ ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, గంధం శ్రీనివాస్, షాకీర్, గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే సమస్యలు పరిష్కరించండి : రంగా

**ఎల్.బి.నగర్, జూలై 11 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహగుప్తా విజ్ఞప్తి చేశారు. చైతన్యపురి డివిజన్ సాయినగం, ఫణిగిరికాలనీలలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాతతో కలిసి గురువారం కార్పొరేటర్ ఆయా కాలనీలలోని సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.నీలిమ, కాలనీ సెక్రటరీ చారీ, లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, రాజగోపాల్, గౌడా, రాజేష్, సుభాష్ బోస్, నర్సింహారావు, బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, రాకేష్ , వెంకట్‌రమణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించండి : ఆకుల



జోనల్ కమిషనర్ కు సమస్యను చూపిస్తున్న శ్రీవాణి అంజన్ కుమార్

**ఎల్.బి.నగర్, జూలై 11 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సరూర్ నగర్ డివిజన్‌పరిధిలోని నల్ల పోచమ్మ బాగ్ ప్రభుత్వ పాఠశాల, భగత్ సింగ్ నగర్, విజయపురికాలనీ, జెబికాలనీ ప్రాంతాలలో ఉన్న పలు సమస్యలను గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సరూర్ నగర్ ఉప కమిషనర్ సుజాతకు చూపించి వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదన్నారు. కాలనీవాసుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈ నీలిమ, జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం చేతుల మీదుగా కల్లు గీత కార్మికులకు సెఫ్టీ గార్డ్ కిట్స్ పంపిణీ : కలెక్టర్ శశాంక



లష్కర్‌గూడలో గీత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11 ప్రభాతవార్త:** కల్లు గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వారి ప్రాణాలకు రక్షణ కల్పించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ గార్డ్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కల్లు గీతా కార్మికులకు ఈ సెఫ్టీ గార్డ్ కిట్స్‌ను అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 14వ తేదీన ప్రారంభించనున్నారు. దీంతో భాగంగా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని పురస్కరించుకుని సభ నిర్వహించేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో స్థలాన్ని గురువారం జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత ఎక్సైజ్, రెవెన్యూ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సెఫ్టీగార్డ్ కిట్స్‌ను గీత కార్మికులకు అందించి వారిని సెఫ్టీగార్డ్ ధరించి తాటిచెట్లు ఎక్కించి ప్రయోగం చేయించారు. సెఫ్టీగార్డు ధరించి తాటిచెట్టు ఎక్కే క్రమంలో ఇబ్బందులు ఉన్నాయా అని కార్మికులను అడిగి తెలుసుకున్న ఆయన సిఎం హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కాగా తాటిచెట్లు ఎక్కువగా ఉన్న సముదాయ ప్రాంతంలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, అందుకే లష్కర్‌గూడలోని ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా జి ప్లస్ త్రి కమర్షియల్ భవన నిర్మాణం



నిబంధనలకు విరుద్ధగా నిర్మించిన కమర్షియల్ భవనం, చిత్రంలో రోడ్డును ఆక్రమించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను నిర్మించిన దృశ్యం

**తుర్కయంజాల్, జూలై 11 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ, బ్రాహ్మణపల్లి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా జి ప్లస్ త్రీ కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. బిల్డింగ్‌కు ఎలాంటి సెట్ బ్యాకు లేకుండా రోడ్డును ఆక్రమణ చేశారు. అంతేకాకుండా ఇప్పుడు కాలనీకి ప్రధాన రహదారి అయిన 30 ఫీట్ల రోడ్డులో తన సొంత బిల్డింగ్ ట్రాన్స్‌ఫార్మర్‌కోసం రోడ్డుపైన పిల్లర్ నిర్మాణం చేసారు. ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌లకు సామా రెసిడెన్సి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసారు. వెంటనే స్పందించిన కమిషనర్ ఈ నిర్మాణాన్ని తొలగిస్తామని ఖచ్చితమైన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సామ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీవాసులు పి.శివకుమార్, మణిపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది : ఎమ్మెల్యే



ఎల్‌ఓసి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది చేకూరుతుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బైరామల్‌గూడకు చెందిన ఇమ్మిడి ప్రమీల మోకాళ్ల నొప్పులతో బాధపడుతుంది. చికిత్సకు తమ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్‌ఫండ్‌నుంచి మంజూరైన లక్షరూపాయల ఎల్‌ఓసి చెక్కును ప్రమీల భర్త యాదయ్యకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో చీర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేయవద్దు: కార్పొరేటర్ దర్పల్లి



కార్మికులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 11 ప్రభాతవార్త:** రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడవేయడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తుతాయని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని అల్తాఫ్‌నగర్‌లో డిసి జకియా సుల్తానా, డిఇ వెంకటేషంతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ తడి, పొడిచెత్తను వేర్వేరుగా జిహెచ్ఎంసి ఆటోకార్మికులకు అందజేయాలని సూచించారు. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని రోడ్ల వెంట చెత్తా చెదారం, మట్టి కుప్పలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, రాంకి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జూలై 11 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఉప్పల్ ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. 11కెవి ఎగ్‌ఉడ్ పీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఉప్పల్ జాతీయ రహదారిలో విద్యుత్ లైన్లు మారుస్తునందున ప్రధాన రహదారిలోని భగాయత్ పరిధిలోని సత్యనగర్, శాంతినగర్, ట్రైకలర్ అపార్ట్‌మెంట్, ఆదిత్య ఆసుపత్రి, నల్ల పోచమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా హబ్సిగూడ పరిధిలోని 11 కెవి ఐఎస్ఐ పీడర్ పరిధిలోని స్ట్రీట్‌నెం.8 పరిధిలోని జెఎస్ఎన్ కాలనీ, జిజి కాలనీ, వివేకానందనగర్, రవీంద్రనగర్ రోడ్డు నెం.6లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అదే విధంగా నాచారం పరిఽధిలోని సాయిబాబా దేవాలయం పీడర్ పరిధిలోని అన్నపూర్ణకాలనీ, రాఘవేంద్రనగర్, సాయినగర్, రవీంద్రనగర్ పార్కు తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎఇ బి.నాగరాజు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : కేఎల్ఆర్

**ఎల్.బి.నగర్, జూలై 11 ప్రభాతవార్త:** కాలనీలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ శ్రీరామకృష్ణపురంకాలనీ, హరిపురికాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను గురువారం వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, బండి మధుసూధన్‌రావు, సురేంద్రకుమార్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘం, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీసర నాగరాజును సన్మానించి అభినందనలు తెలుపుతున్న మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, నాయకులు చిలుక మధుసూదన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వంగ లక్ష్మీకాంత్‌రెడ్డి, పులి కృష్ణ తదితరులు (ప్రభాతవార్త, సరూర్‌నగర్)